• నిఖిలానందం



ప్రముఖ నృత్య గురువు దొడ్డ బాలాజీ కుమార్ శిష్యురాలు కె.నిఖిల కూచిపూడి నాట్య ప్రవేశం శనివారం రవీంద్రభారతిలో కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా గణేశ వందనం, ప్రవేశ దరువు, పంచరత్న కీర్తన, అన్నమాచార్య పదార్చన, దేవీస్తుతి తదితర అంశాలపై సాగిన నృత్య ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. అనంతరం ఎమ్మెల్యే పద్మావతి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ చిన్నారులను కళలలో ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రొఫెసర్ సీవీజీ సుబ్రహ్మణ్యం, స్లేట్ స్కూల్ చైర్మన్ వాసిరెడ్డి అమర్నాథ్, ప్రభుత్వ సంగీత కళాశాల ప్రిన్సిపాల్ కె.వరలక్ష్మి, నృత్య గురువు భాగవతుల సేతూరాం, డాక్టర్ వనజ ఉదయ్ తదితరులు పాల్గొన్నారు. – గన్‌ఫౌండ్రీ

'శోభాయాత్ర' బ్రోచర్ విడుదల



బ్రోచర్ విడుదల చేసిన సభ్యులు

జియాగూడ: నేటి ఉదయం 7 గంటలకు చార్మినార్ భాగ్యలక్ష్మి టెంపుల్ నుంచి గోల్కొండ వరకు నిర్వహించనున్న భారీ ర్యాలీని విజయవంతం చేయాలని గోల్కొండ బీజేడీఎం అధ్యక్షుడు రాజేందర్ డెగాన్, నవభారత్ సంఘం అధ్యక్షుడు మదిర సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు శనివారం జియాగూడ ఇమాంపురాలోని నవభారత్ సంఘంలో మోహిమ్ దీక్షిత్ దిగ్విజయ్ శోభాయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ.. ఛత్రపతి శివాజీ మహరాజ్ 1677వ సంవత్సరం ఫిబ్రవరి 4న గోల్కొండ కుతుబ్‌షాహీ రాజుతో సమావేశమయ్యేందుకు కోటకు వచ్చారన్నారు. ఈ సందర్భంగా మోహిమ్ దీక్షిత్ దిగ్విజయ్ దీక్ష ఉత్సవంగా జరుపుతున్నామన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు జి.వినయ్‌కుమార్, ఎం.మహేశ్‌బాబు, ఎ.యాదయ్య, ఆర్.రవి తదితరులున్నారు.

సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకోండి



షాదీ ముబారక్ చెక్కులు అందిస్తున్న కార్వాన్ ఎమ్మెల్యే

గోల్కొండ: అర్హులందరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ సూచించారు. శనివారం ఆయన కార్వాన్‌లో పలువురు లబ్ధిదారులకు షాదీ ముబారక్, కళ్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల ముందు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు ఒకొక్కటిగా మంజూరవుతున్నాయని చెప్పారు. కార్వాన్ నియోజకవర్గంలో పేదలు ఎక్కువగా ఉంటారని, వారిలో అర్హులైనవారు సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పొదుపు సంఘాల ఏర్పాటు కోసం మహిళలు బల్దియా అధికారులను సంప్రదించాలని తెలిపారు. మరోవైపు చదువుకున్న వారు ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా వ్యాపారాలు చేసుకోవాలని, వారికి ప్రభుత్వ రుణాలు అందేలా సహకారం అందిస్తానని ఎమ్మెల్యే అన్నారు. కార్వాన్ నియోజకవర్గంలో కోట్లాది రూపాయాలతో అభివృద్ధి పనులు చేయిస్తున్నట్టు చెప్పారు. బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు కోసం మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ సహకరిస్తున్నారని తెలిపారు.

ట్రాఫిక్ సమస్యలు సృష్టించొద్దు

ట్రాఫిక్ అదనపు డీసీపీ శ్రీనివాసాచార్యులు



సదస్సులో మాట్లాడుతున్న శ్రీనివాసాచార్యులు

యాకుత్‌పురా: ట్రాఫిక్ పోలీసుల సూచనలు పాటిస్తూ వ్యాపారాలు చేసుకోవాలని ట్రాఫిక్ అదనపు డీసీపీ శ్రీనివాసాచార్యాలు చిరు వ్యాపారులకు సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శనివారం మీర్‌చౌక్, ఫలక్‌నుమా ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో చార్మినార్ సమీపంలోని సనా గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో చార్మినార్, ఫలక్‌నుమా ప్రాంతాల్లోని వీధి వ్యాపారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీసీపీ మాట్లాడుతూ.. ప్రధాన రోడ్లు, ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో సమస్యలు రాకుండా చిరు వ్యాపారులు చేసుకోవాలని సూచించారు. సదస్సులో మీర్‌చౌక్, చార్మినార్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు మహ్మద్ నయీముద్దీన్, రఘురాం, ఎస్సై గణేశ్, ఏఎస్సై అనూరాధ, గోషామహల్ ట్రైనింగ్ కేంద్రం ఏఎస్సై ఆదిల్ తదితరులున్నారు.

ఖమ్మం ఎంపీ టికెట్ కోసం దరఖాస్తు



గాంధీభవన్‌లో దరఖాస్తు అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

నాంపల్లి: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మం నుంచి టికెట్ ఆశిస్తున్నట్టు టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ మద్ది శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం నాంపల్లిలోని గాంధీభవన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. 34 సంవత్సరాలుగా ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్, కాంగ్రెస్ లీడర్‌సెల్‌తో పాటుగా పలు శాఖల్లో కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసినట్టు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. 2018, 2023లో పాలేరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే టికెట్, అదే విధంగా 2021లో ఖమ్మం-నల్లగొండ-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ టికెట్ కోసం ఆశించి భంగపడినట్టు గుర్తుచేశారు. కార్యక్రమంలో పులివెందుల ప్రతాపరెడ్డి, అల్లం భాస్కర్, రాష్ట్ర నాయకుడు అనిల్‌కుమార్ యాదవ్, రాష్ట్ర అధికార ప్రతినిధి దామోదర్ అవేలి, రామ్మోహన్‌రెడ్డి, మీడియా కోఆర్డినేటర్ శ్రీకాంత్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, కొత్త శోభన్‌రెడ్డి, మంగు నాయక్ పాల్గొన్నారు.

'హైదరాబాద్' టికెట్ కోసం..

చార్మినార్: హైదరాబాద్ ఎంపీ టికెట్ తనకు కేటాయించాలని కోరుతూ శనివారం గాంధీభవన్‌లో దరఖాస్తు అందజేసినట్టు పాతబస్తీ గౌలిపురాకు చెందిన టీపీసీసీ మాజీ కార్యదర్శి కె.ఎస్.ఆనందరావు తెలిపారు. మూడు దశాబ్దాలకు పైగా కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలక కార్యకర్తగా పని చేస్తున్నానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. మున్నూరు కాపు సామాజిక వర్గానికి కాంగ్రెస్ పార్టీలో సముచిత స్థానం లభించాలంటే హైదరాబాద్ పార్లమెంట్ టిక్కెట్ తనకు కేటాయించాలని ఆయన కోరారు.

ఈ నెల 15న ఆటోబంద్



మాట్లాడుతున్న అమానుల్లాఖాన్

సుల్తాన్‌బజార్: తమ సమస్యలపై ఈ నెల 15న ఒక్క రోజు ఆటో బంద్ నిర్వహించనున్నట్టు తెలంగాణ ఆటో డ్రైవర్ జేఏసీ కన్వీనర్ మహ్మద్ అమానుల్లాఖాన్ తెలిపారు. ఈ మేరకు శనివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉచిత బస్సు ప్రయాణం బదులు సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేయాలని డిమాండ్ చేశారు. 15 మంది ఆటోడ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నా ప్రభుత్వం ఎందుకు స్పందించ లేదని ఆయన ప్రశ్నించారు. ఆటో డ్రైవర్ తన ఆటోను ప్రజాభవన్ ముందే తగులబెట్టుకున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని ఆవేదన చెందారు. డ్రైవర్ కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందజేయాలని డిమాండ్ చేశారు. 15న తలపెట్టిన ఒక్క రోజు ఆటో బంద్‌లో ఆటోడ్రైవర్లు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని అమానుల్లాఖాన్ పిలుపునిచ్చారు. సమావేశంలో జేఏసీ ప్రతనిధులు అజీముద్దీన్, షేక్ ముక్కు సయ్యద్ తఫీ తదితరులున్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ సీనియర్ నేత



లెనిన్‌బాబుకు కండువా కప్పిన రాజేశ్

చాంద్రాయణగుట్ట/బహదూర్‌పురా: పాతబస్తీ పూల్‌బాగ్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బాలిశెట్టి లెనిన్ బాబు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కాల్వగడ్డలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో లెనిన్‌తో పాటు ఆయన అనుచరులకు బహదూర్‌పురా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పులిపాటి రాజేశ్‌కుమార్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాజేశ్ మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తోందన్నారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత జోడో న్యాయ యాత్రతో స్ఫూర్తితో ఎంతో మంది కాంగ్రెస్‌లో చేరుతున్నారని చెప్పారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ విజయం కోసం ప్రతి ఒక్కరు పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు జి.కన్నయ్య లాల్, పీసీసీ కార్యదర్శి బి.వెంకటేశ్ ముదిరాజ్, నాయకులు మోహన్ రెడ్డి, ముజాహిద్, ఇక్బాల్, చంద్రశేఖర్, అబేద్ అలీ తదితరులున్నారు.

రోడ్డుపైనే పార్కింగ్

- పాత ముంబయి రూట్‌లో ట్రాఫిక్ ఇక్కట్లు
- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు



పాత ముంబయి జాతీయ రహదారికి ఆనుకొని నిలిపిన కార్లు

గోల్కొండ: కేవలం ద్విచక్ర వాహనదారులనే టార్గెట్ చేస్తూ.. అక్రమ పార్కింగ్‌లు, వాహనాల తనిఖీలంటూ ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. అయితే, అక్రమంగా రోడ్లపై నిలుపుతున్న కార్లను మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు నిబంధనలు అతిక్రమించే వాహనాలపై ఎందుకు చర్యలు తీసుకోవట్లేదంటూ ద్విచక్ర వాహనాదారులు ట్రాఫిక్ పోలీసులను ప్రశ్నిస్తున్నారు.

అక్రమ పార్కింగ్‌ల అడ్డాలు

పాత ముంబయి జాతీయ రహదారి, షేక్‌పేట్ డీమార్ట్, టోలీచౌకి రాఘవేంద్ర హోటల్, టోలీచౌకి చౌరస్తా రుమాన్ హోటల్, ఫోడియం మాల్, షేక్‌పేట్ పాస్‌పోర్టు సేవా కేంద్రం, సెవన్ టూంబ్స్ చౌరస్తా, టోలీచౌకి పశ్చిమ మండలం ఆర్టీఓ కార్యాలయం, షాగౌస్ హోటల్, రేతిబౌలి చౌరస్తా, మెహిదీపట్నం మెరాజ్ చౌరస్తా ప్రాంతాలలో చాలామంది రోడ్లపైనే కార్లు నిలుపుతున్నారు. గంటల తరబడి పార్క్ చేసి ఉంచడం వల్ల ప్రధాన రహదారులపై ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆయా ప్రాంతాలు ప్రజలు చెబుతున్నారు. తమను వెంబడించి మరీ పట్టుకొని చలాన్‌లు విధించే ట్రాఫిక్ పోలీసులు.. రోడ్లపై నిలిపిన కార్లను ఎందుకు వదిలేస్తున్నారని ఆటో డ్రైవర్లు ప్రశ్నిస్తున్నారు. ఏదేమైనా ట్రాఫిక్ పోలీసులు తమపై ప్రతాపం చూపుతున్నారని ద్విచక్ర వాహనాదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

అఫ్జల్‌గంజ్: 11 కేవీ దత్తాత్రేయ నగర్ అండర్ గ్రౌండ్, బేగంబజార్, పురానాపూల్ ఓవర్ హెడ్ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని దత్తాత్రేయ కాలనీ, కిషన్‌నగర్, బేగంబజార్ ఛత్రీ, సెవెన్ హెవన్ హోటల్, కంటి ఆస్పత్రి లేన్, జుమ్మేరాత్ బజార్, ఎంసీహెచ్ కార్యాలయం, బాపూజీనగర్ తదితర ప్రాంతాల్లో నేటి(ఆదివారం) ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరాఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. అదేవిధంగా 11 కేవీ పుత్లీబౌలీ విద్యుత్ ఫీడర్ పరిధిలోని మహాత్మాగాంధీ బస్ స్టేషన్, అఫ్జల్‌గంజ్ బస్టాండ్, సీబీఎస్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 వరకు, 11 కేవీ ఉస్మాన్‌గంజ్, దత్తాత్రేయ నగర్ ఓవర్‌హెడ్, ఆసిఫ్‌నగర్ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని అఫ్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్, ఉస్మానియా ఆస్పత్రి లేన్, గోల్ మజీద్ లేన్, జ్యోతి గ్యాస్ లేన్, పాపాలాల్ పీటీ, వెంకటమ్మ తోట, మల్లేపల్లి, ద్రౌపతి గార్డెన్, ఫ్రెండ్స్ కేఫ్, మాంగర్ బస్తీ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ ఉండదు.

'ఎస్సీ మోర్చా' అధ్యక్షుడికి సత్కారం



నాంపల్లి: బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా ఇటీవల నియమితులైన కె.శ్రీధర్‌ను బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యుడు మంగళారపు రామ్‌దాస్, ప్రధాన కార్యదర్శులు కింతి కిరణ్, కుమ్మరి శంకర్ శనివారం కలిసి సత్కరించారు.

శ్రీధర్‌ను కలిసిన బాలకృష్ణ

చార్మినార్: బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్‌ను శనివారం బీజేపీ సీనియర్ నాయకుడు జి.బాలకృష్ణ కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న విద్యార్థుల రిమాండ్

సంతోష్‌నగర్: గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు విద్యార్థులను కంచన్‌బాగ్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి.. శనివారం రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ జి.శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రామంతాపూర్ ప్రాంతానికి చెందిన డిప్లొమా విద్యార్థి అభిషేక్(19), బాలాపూర్‌కు చెందిన ఇంటర్ విద్యార్థి నాగవంశీ(19), సైదాబాద్ ప్రాంతానికి చెందిన ఐటీఐ విద్యార్థి రాజు(23) కలిసి రామంతాపూర్ ప్రాంతానికి చెందిన ప్రకాశ్ వద్ద గంజాయి కొనుగోలు చేశారు. ఆపై గంజాయిని 5–6 గ్రాముల ప్యాకెట్లుగా తయారు చేసి రూ.300–500లకు విక్రయిస్తున్నారు. శుక్రవారం పిసల్‌బండ చౌరస్తాలో ఈ ముగ్గురూ గంజాయి అమ్మేందుకు సిద్ధమయ్యారు. కాగా, సమాచారం అందుకున్న కంచన్‌బాగ్ పోలీసులు దాడులు నిర్వహించి అభిషేక్, నాగవంశీ, రాజులను అరెస్ట్ చేసి వారి నుంచి 2 కేజీల గంజాయి, మూడు సెల్‌ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు.

రాష్ట్రంలో సంక్షేమ పాలన ప్రారంభం

గోల్కొండ: సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో సంక్షేమ పాలన మొదలైందని కార్వాన్ కాంగ్రెస్ నాయకుడు కురాకుల కృష్ణ అన్నారు. శనివారం రింగ్‌రోడ్డు వద్ద ఆయన కాంగ్రెస్ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.... ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల్లోనే అమలు చేస్తుందని చెప్పారు. సీఎం సంక్షేమ పాలనపై దృష్టి పెట్టారని, ఉపాధి కల్పనకు కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎం.ఆర్.రెడ్డి, రాములు, అహ్మద్ ఖాన్, చంటిబాబు ఉన్నారు.

ఆధ్యాత్మిక చింతన అవసరం



మాట్లాడుతున్న మాధవీలత

గౌలిపురా: నేటితరం చిన్నారులను ఆధ్యాత్మిక చింతన వైపు మళ్లించాల్సిన అవసరం ఉందని లతామా ఫౌండేషన్ చైర్మన్ కొంపల్లె మాధవీలత అన్నారు. శనివారం రాత్రి గౌలిపురా డివిజన్‌లోని బతుకమ్మ బావి వద్దనున్న 300 ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీ కోదండరామ స్వామి ఆలయాన్ని ఆమె సందర్శించి.. ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాధవీలత మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలకు విద్యతో పాటు శ్లోకాలను సైతం నేర్పించాలన్నారు. కార్యక్రమంలో గౌలిపురా కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి, ఆలయ ధర్మకర్తలు కొంపల్లి భరద్వాజ్ తదితరులున్నారు.

శాస్త్రీయ కళలను కాపాడుకుందాం



విజేతలతో వేణుగోపాలాచారి, శ్రీనివాస్ గుప్తా

గన్‌ఫౌండ్రీ: శాస్త్రీయ సంగీత కళలను కాపాడుకోవాలని కేంద్ర మాజీ మంత్రి ఎస్.వేణుగోపాలాచారి అన్నారు. శనివారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీ అలేఖ్య సాంస్కృతిక సంఘ సేవా సంస్థ ఆధ్వర్యంలో 'నీపాదం.. ఇలలోనే నాట్య వేదం' 'నీ గానం బాలు సుస్వరాల గానం' పేరిట నృత్య, సంగీత పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సినీ నటి రాజన్న ఫేమ్ అనీ చిన్నారులతో కలిసి సందడి చేశారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన చిన్నారులకు జ్ఞాపిక, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక శాఖ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, స్వచ్ఛభారత్ అభియాన్ ఫౌండర్ మాధవరం కాంతారావు, సంస్థ వ్యవస్థాపకురాలు ఉపద్రష్ట అరుణ, అశోక్ పాల్గొన్నారు.

కర్పూరి ఠాకూర్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న లక్ష్మణ్ తదితరులు

సుల్తాన్‌బజార్: అత్యంత వెనుకబడిన కులానికి చెందిన జన నాయక్ కర్పూరి ఠాకూర్ గతంలో బిహార్ ముఖ్యమంత్రి కావడం అప్పట్లోనే దేశ రాజకీయాల్లో కీలక మలుపని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. శనివారం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో నాయీ బ్రాహ్మణుల కృతాభివందన సభ జరిగింది. కార్యక్రమంలో లక్ష్మణ్ మాట్లాడుతూ.. దేశ సంపదను సృష్టించే శ్రమ జీవులను గత పాలకులు విస్మరించారన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం వారి సంక్షేమానికి పనిచేస్తోందన్నారు. కర్పూరి ఠాకూర్ సేవలను గుర్తించి భారతరత్న ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం కర్పూరి ఠాకూర్ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సూర్యనారాయణ, రాంబాబు, శ్రీనివాస్, పద్మశ్రీ అవార్డు గ్రహీత ఉమామహేశ్వరి, సుమతి, దేవరకొండ నాగరాజు, డాక్టర్ సారంగపాణి, రావ్రోలు సుదర్శన్, శ్రీధర్ మురారి, వికాస్‌కుమార్, సుధాకర్, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు వికలాంగుల కోసం శిబిరం

సుల్తాన్‌బజార్: ప్రతిష్టాత్మక జాతీయ అవార్డు గెలుచుకున్న ఎన్‌జీఓ నారాయణ్ సేవా సంస్థాన్ నేడు తెలంగాణలో వికలాంగుల సంక్షేమం కోసం ఉచిత భారీ శిబిరం నిర్వహించనుందని భగవాన్ ప్రసాద్ గౌర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్యక్రమ బ్రోచర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రమాదంలో చేతులు, కాళ్లు కోల్పోయినవారిని రక్షించేందుకు తమ సంస్థ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో భాగంగా ఉచిత వైకల్య స్క్రీనింగ్ ఎంపిక, నారాయణ లింబ్, కాలిపర్స్ మెజర్‌మెంట్ క్యాంప్ నిర్వహిస్తామన్నారు. కింగ్‌కోఠిలోని ఈడెన్ గార్డెన్ ఫంక్షన్ ప్యాలెస్(హాల్), నెదర్ సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు, కార్యక్రమం ఉంటుందన్నారు. తమ వెంట ఆధార్‌కార్డు, వైకల్య ధృవీకరణ పత్రం, వైకల్యాన్ని తెలిపే 2 ఫొటోలు తీసుకురావాలని సూచించారు. సమావేశంలో ఇనిస్టిట్యూట్ ప్రెసిడెంట్ ప్రశాంత్ అగర్వాల్, క్యాంపు ఇన్‌చార్జి నరేంద్ర సింగ్ చౌహాన్, హైదరాబాద్ బ్రాంచ్ కో–ఆర్డినేటర్ అల్కా చౌదరి, హైదరాబాద్ శాఖ కార్యవర్గ మాజీ అధ్యక్షుడు ఉత్తమ్ దద్రాణి అభయ్ చౌదరి, సామాజిక కార్యకర్త జస్మత్ భాయ్ పటేల్, రిదేశ్ జాగిర్దార్ పాల్గొన్నారు.

అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాలి




మాట్లాడుతున్న హ్యూమన్ రైట్స్ ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: కడ్తాల్ మండలం హనుమాస్‌పల్లి పిరమిడ్ సొసైటీ సమీపంలో వెలసిన అక్రమ వెంచర్లపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని నేషనల్ హ్యూమన్ రైట్స్(ఎన్‌హెచ్‌ఆర్) తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రశాంత్ రిపిక డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల క్రితం అక్రమంగా వెలసిన వెంచర్లలో మౌలిక వసతులు అక్కడ ప్లాట్లు కొనుగోలు చేసిన బాధితులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వెంచర్ల పేరుతో వందల కోట్ల కుంభకోణం జరుగుతోందని, తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించారని ఆరోపించారు. ఈ విషయంపై ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా అనుమతులు లేని విషయం బయటపడిందన్నారు. పిరమిడ్ స్పిరుచ్యువల్ సొసైటీకి సంబంధించిన ఐదు కంపెనీలు ఈ వందల కోట్ల కుంభకోణానికి పాల్పడుతున్నట్టు వారు ఆరోపించారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేయగా తమను బెదిరింపులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఈ విషయంపై ప్రభుత్వం తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దినేశ్‌కుమార్, లీగల్ అడ్వైజర్ దీప్తి నాగేందర్, పి.శిల్ప పాల్గొన్నారు.

గవర్నర్ అయినా.. సిటీ కాలేజీ పూర్వ విద్యార్థినే

ఎన్.ఇంద్రసేనా రెడ్డి

చార్మినార్: దేశంలో.. ఎక్కడ.. ఏ హోదాలో ఉన్నా.. సిటీ కాలేజీ పూర్వ విద్యార్థినని చెప్పుకోవడంలో అమితానందం కలుగుతుందని త్రిపుర గవర్నర్ ఎస్.ఇంద్రసేనా రెడ్డి అన్నారు. తాను ప్రస్తుతం ఒక రాష్ట్రానికి గవర్నర్‌గా ఉన్నప్పటికీ.. సిటీ కాలేజీ విద్యార్థిననే విషయాన్ని గర్వంగా చెబుతానన్నారు. సిటీ కాలేజీ పూర్వ విద్యార్థులైన ఎన్.ఇంద్రసేనారెడ్డితో పాటు మాజీ ఎంపీ మధు యాష్కీ గౌడ్, చార్మినార్ ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన మీర్ జుల్ఫీకర్ అలీలను శనివారం కాలేజీలో ఘనంగా సన్మానించారు. ఈ సంర్భంగా ఇంద్రసేనా రెడ్డి మాట్లాడుతూ.. కళాశాలలోని పేద విద్యార్థులకు సహాయ సహకారాలు అందించేందుకు ఒక కార్యాచరణను రూపొందించి విరాళాలు సేకరిస్తే ఫలితాలుంటాయన్నారు. కాలేజీ భవనం మరమ్మత్తుల కోసం కేంద్ర పురావస్తు శాఖతో మాట్లాడతానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాలభాస్కర్, ఎజాజ్ సుల్తానా, విప్లవ దత్ శుక్లా, పావని పాల్గొన్నారు.



మాట్లాడుతున్న త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి

షబ్బీర్ అలీకి సన్మానం



షబ్బీర్ అలీను సత్కరించిన ముజీబ్ హుస్సేని తదితరులు

అబిడ్స్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే జరుగుతుందని టీఎన్జీఓస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీస్ ప్రభుత్వ సలహాదారుడిగా నియమితులైన షబ్బీర్ అలీని టీఎన్జీఓస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ముజీబ్ హుస్సేని మాట్లాడుతూ.. మైనార్టీల అభివృద్ధికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని షబ్బీర్ అలీని కోరారు. కార్యక్రమంలో నిజాముద్దీన్, ఉస్మానీ అలీ ఉస్మానీ, మొహ్మద్ జమాల్, రామకృష్ణారెడ్డి రోహిత్ తదితరులున్నారు.

త్వరలో 'ఎగ్జిబిషన్' స్పోర్ట్స్ మీట్



ఏర్పాట్లపై చర్చిస్తున్న మంజిత్‌రెడ్డి, కన్వీనర్ రాజశేఖర్

అబిడ్స్: నాంపల్లి ఎగ్జిబిషన్ సొసైటీ సభ్యుల కోసం త్వరలో స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నట్టు స్పోర్ట్స్ మీట్ సబ్ కమిటీ సలహాదారుడు మంజిత్‌రెడ్డి, కన్వీనర్ రాజశేఖర్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఎగ్జిబిషన్ సొసైటీ గాంధీ సెంటినరీ హాల్‌లో స్పోర్ట్స్ మీట్ ఏర్పాట్లను పరిశీలించి పోటీలకు డ్రా తీశారు. చెస్, క్యారమ్స్, టేబుల్ టెన్నిస్, క్రికెట్ తదితర పోటీలను నిర్వహిస్తున్నామని ఈ సందర్భంగా మంజిత్‌రెడ్డి తెలిపారు. విజేతలకు ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో బహుమతులు అందిజేస్తామన్నారు.

మెరిట్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహం



విద్యార్థులతో ఏజీఎం కృష్ణ, ప్రిన్సిపాల్ స్వాతి

నాంపల్లి: ఇటీవల నిర్వహించిన క్యాట్ ఒలంపియాడ్ పరీక్షల్లో మెహిదీపట్నంలోని శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ స్వాతి తెలిపారు. ఈమేరకు శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో క్యాట్ అవార్డ్స్ పొందిన ఐదుగురు విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్స్, మెడల్స్ గెలిచిన 87 మందిని మెహిదీపట్నం జోన్ ఏజీఎం బి.కృష్ణ అభినందించారు. కార్యక్రమంలో ఆర్ఐ హరికృష్ణ, అకడమిక్ కోఆర్డినేటర్ ప్రవీణ్, డీన్ ఓంకార్, ఆంజనేయులు, సి–ఇన్‌చార్జి నదీం, ఒలంపియాడ్ ఇన్‌చార్జి రజని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధిపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ నిర్మల ప్రభావతి, మనోహర్ గైక్వాడ్ తదితరులు

అబిడ్స్: కుష్టువ్యాధి నివారణపై నిర్వహించిన అవగాహన ర్యాలీలో హైదరాబాద్ డీఎంఆర్ హెచ్ఓ డాక్టర్ నిర్మల ప్రభావతి, డీపీఎంఓ శాంతిరాజ్,ఆశ, స్వాతి, పింకి, సంఘ సేవకుడు మనోహర్ గైక్వాడ్ పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. ర్యాలీ మంగళ్‌హాట్, గుఫానగర్, ఇంద్రానగర్ ప్రాంతాల్లో కొనసాగింది.

గోమాతకు రాష్ట్రీయ గుర్తింపు ఇవ్వాలి



సంతకాలు సేకరిస్తున్న నాయకులు


సుల్తాన్‌బజార్: రాష్ట్ర ప్రభుత్వం గోవును రాష్ట్రీయ గోమాతగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ భజరంగ్ సేన ఆధ్వర్యంలో శనివారం కోఠి ఆంధ్రా బ్యాంక్ చౌరస్తాలో కోటి సంతకాల సేకరణ చేపట్టింది. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు ఎన్ఆర్.లక్ష్మణ్‌రావు గోవులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన ంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో గోవులను కబేళాలకు తరలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోటి సంతకాల సేకరణ పూర్తి కాగానే ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం రేవంత్‌రెడ్డికు పంపిస్తామన్నారు.

అమృతోదయం నవల ఆవిష్కరణ



నాంపల్లి: చారిత్రక నవలా చక్రవర్తి ప్రొఫెసర్ ముదిగొండ శివప్రసాద్ రచించిన 'అమృతోదయం'(ప్రాచీన ముసునూరి చక్రవర్తులపై ప్రప్రథమ ప్రామాణిక చారిత్రక నవల) ఆవిష్కరణోత్సవ సభ శనివారం రాత్రి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో జరిగింది. కార్యక్రమాన్ని రసమయి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. పంచ సహస్రావధాని డాక్టర్ మోహన్ అధ్యక్షతన జరిగిన ఈ సభకు ముఖ్య అతిథిగా తమిళనాడు పూర్వ గవర్నర్ పి.ఎస్.రామమోహన్ రావు హాజరయ్యారు. కార్యక్రమంలో స్తపతి సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి, తెలుగు వన్ ఛానల్ అధినేత డాక్టర్ కంఠమనేని రవిశంకర్, వాణిజ్య పన్నుల శాఖ విశ్రాంత ముఖ్య కమిషనర్ ఎం.నరసింహప్ప, రసమయి సంస్థ అధ్యక్షుడు డాక్టర్ ఎం.కె.రాము, నిర్వాహకులు జె.నరసింహారావు పాల్గొన్నారు. కళారత్న ఎం.కె.ఆర్.ఆశాలత వ్యాఖ్యాతగా వ్యవహరించగా.. ఇందిర శిష్య బృందం, రేణుకా ప్రభాకర్ శిష్య బృందం ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు ఆకట్టుకున్నాయి.

కలసికట్టుగా కేన్సర్‌ను జయిద్దాం



డాక్టర్ కల్యాణ్

నాంపల్లి: ప్రపంచ కేన్సర్ దినోత్సవం శనివారం ఘనంగా జరిగింది. రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్‌లో ఎఫ్‌టీసీసీఐ, తెలంగాణ లయన్స్ క్లబ్, టప్మా సంస్థల సంయుక్తాధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా 'కేన్సర్‌ను జయిద్దాం' అనే అంశంపై సదస్సుకు వక్తగా ప్రముఖ ఆంకాలజిస్ట్ డాక్టర్ కల్యాణ్ హాజరై మాట్లాడారు. దేశవ్యాప్తంగా గత ఏడాది దాదాపు 20 లక్షల కేన్సర్ కేసులు నమోదైనట్టు తెలిపారు. మన దేశంలో వ్యాధి నిర్ధారణ రేటు 29 శాతంగా ఉందని చెప్పారు. నోటిలో పుండు మూడు వారాల్లో నయం కాకపోతే వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ పట్టిహిల్, లయన్ పాస్ట్ ఇంటర్నేషనల్ గత డైరెక్టర్ ఆర్.సునీల్ కుమార్, లయన్స్ ఇంటెల్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్ బాబురావు, ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు మీలా జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.